


# హిమాలయాలకు వెళ్లనున్న అఖండ-2

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ-2' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్ ఇది. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలు నమోదవడంతో ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. తదుపరి షెడ్యూల్ కోసం దర్శకుడు బోయపాటి శ్రీను హిమాలయాల్లో లొకేషన్ రెక్కీ చేస్తున్నారు. అక్కడి సుందరమైన ప్రదేశాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను తెరకెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ సీన్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదలకానుంది. సంయుక్త మీనన్, ఆది పినిశెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.

# దేశరాజధానిలో కుస్తీ పోటీలు?



అగ్ర హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన'ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కర్నాటకలో కొంతభాగం జరిగింది. త్వరలో ఢిల్లీ షెడ్యూల్ మొదలు కానుంది. అక్కడ కుస్తీ పోటీలకు సంబంధించిన సన్నివేశాలు చిత్రీకరిస్తారని తెలుస్తున్నది. అసలు కుస్తీ పోటీలకూ ఢిల్లీ నగరానికి, ఈ కథకూ సంబంధం ఏంటి? అనేది ఆసక్తికరమైన విషయమట. ఈ సినిమాలో కథ రీత్యా రెండు క్రీడల నేపథ్యాలుంటాయని ఇప్పటికే లీకైంది. క్రికెట్ నేపథ్యంలో సాగే కొన్ని సన్నివేశాలను ఇప్పటికే రామ్‌చరణ్, 'మీర్జాపూర్'ఫేం దివ్యాంశులపై చిత్రీకరించారు. రేపు ఢిల్లీలో తీసే కుస్తీ పోటీల్లో రామ్‌చరణ్‌తో తలపడే వ్యక్తి ఎవరు? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సన్నివేశాలను రామ్‌చరణ్, శివరాజ్‌కుమార్‌లపై చిత్రీకరిస్తారట. అయితే.. ప్రస్తుతం శివరాజ్‌కుమార్ విశ్రాంతిలో ఉన్నారు. ఈ లోపు ఆయన లేని సీన్స్ తీస్తారట. ఈ షెడ్యూల్ చివర్లో శివరాజ్‌కుమార్ ఎంటర్ అవుతారని తెలుస్తున్నది. ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్ అనుకుంటున్నట్టు వార్తలొచ్చాయి. మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ పానిండియా సినిమాలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# గోప్యంగా ఉంచమని అమ్మ చెప్పింది



'మనిషికి మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసికంగా బలంగా లేకపోతే.. శారీరకంగా కూడా బలహీనపడే అవకాశం ఉంటుంది. మెదడు నుంచి శరీరానికి పాజిటివ్ సిగ్నల్స్ వెళ్లాలి కానీ.. నెగెటివ్ సిగ్నల్స్ వెళ్లకూడదు. అలా జరిగితే ప్రమాదంలో పడతాం.' అంటూ చెప్పుకొచ్చింది బాలీవుడ్ భామ దీపికా పదుకొణె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కొన్నేళ్ల క్రితం మానసికంగా తాను ఎదుర్కొన్న సమస్యల్ని ఆమె గుర్తుచేసుకున్నది. '2014లో కెరీర్ పరంగా పీక్స్‌లో ఉన్నా. క్షణం తీరిక లేకుండా సినిమాలు చేస్తున్న రోజులవి. పైగా అన్ని విషయాల్లోనూ ఆనందంగా ఉన్నా. అలాంటి సమయంలో ఓసారి తీవ్ర అలసటకు గురై లొకేషన్‌లోనే కళ్లు తిరిగి పడిపోయా. ఇవన్నీ వృత్తిలో భాగమేలే అని ముందు లైట్ తీసుకున్నా. కానీ ఎందుకో మనసు కీడు శంకించడం మొదలుపెట్టింది. అందుకే.. అవసరమైన స్కానింగులు, టెస్ట్‌లు చేయించుకున్నా. నా పరిస్థితి అంత బాలేదని అర్థమైంది. నిజానికి ట్రీట్మెంట్ తీసుకుంటే తగ్గిపోయే సమస్యలే అవన్నీ. కానీ ఏదో అయిపోతున్నట్టు భయపడిపోయేదాన్ని. విపరీతంగా ఏడ్చేసేదాన్ని. మానసికంగా కృంగిపోయా. నా విషయం తెలుసుకొని మా అమ్మ నన్ను చూడ్డానికి ముంబయ్ వచ్చింది. అమ్మ సూచన ప్రకారం థెరపిస్ట్‌ని కలిశాను. నేను థెరపిస్ట్ వద్దకు వెళ్తున్న విషయాన్ని గోప్యంగా ఉంచమని అమ్మ చెప్పింది. అమ్మమాటను పాటించి, ఎవరికీ తెలీకుండా సీక్రెట్‌గా థెరపీ తీసుకునేదాన్ని. నిదానంగా ఈ రుగ్మత నుంచి తేరుకున్నా. కోలుకున్న తర్వాత అనిపించింది. మానసిక ఆరోగ్యం గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పాలని. 'లివ్ లాఫ్ లవ్' ఫౌండేషన్ నేను స్థాపించడానికి కారణం అదే.' అంటూ గుర్తు చేసుకున్నది దీపిక పదుకొణె.

# దైవం వైపు నాస్తికుడి ప్రయాణం

శ్రీకాళహస్తి స్థలపురాణం ఆధారంగా మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఈ చిత్రంలో మోహల్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి అగ్ర తారలు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. నాస్తికుడైన కన్నప్ప పరమ శివభక్తుడిగా మారే సంఘటనల నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. శివపార్వతులుగా అక్షయ్‌కుమార్, కాజల్ అగర్వాల్ కనిపించారు. చివరిగా రుద్రుడి పాత్రలో ప్రభాస్ ఎంట్రీ హైలైట్‌గా నిలిచింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు.



# రీఎంట్రీకి సిద్ధమైన రంభ



ఒకప్పుడు అగ్ర కథానాయికల్లో ఒకరిగా రాణించింది రంభ. తొంభై దశకంలో యువ తరంలో మంచి క్రేజ్ సంపాదించుకొని పలు విజయవంతమైన చిత్రాల్లో భాగమైంది. కొన్నేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్న ఆమె తాజాగా రీఎంట్రీకి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రంభ మాట్లాడుతూ 'సినీరంగంలోకి పునరాగమనానికి ఇదే సరైన సమయం అనుకుంటున్నా. నా వయసుకు తగినట్లు చాలెంజింగ్ రోల్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. మంచి పాత్రల ద్వారా తిరిగి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకోవాలనుకుంటున్నా' అని చెప్పింది.



# జాక్ రెడ్డి కులాభిమానం

జాక్ రెడ్డి.. ఇతనికి కాస్త కుల ఫీలింగ్ ఎక్కువ. 'యోగి వేమన కూడా మా కులంవాడే.. ఆయన అసలు పేరు వేమారెడ్డి.' అని గర్వంగా చెప్పుకుతిరిగేంత కులాభిమానం ఇతని సొంతం. చూడ్డానికి సీరియస్‌గా ఉంటాడు. కానీ తెరపై మాత్రం నవ్వుల్ని పూయిస్తాడు. సింపుల్‌గా ఇది జాక్ రెడ్డి క్యారెక్టర్. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాలో తరుణ్‌భాస్కర్ నటిస్తున్న పాత్ర పేరు.. తీరుతెన్నులు ఇవి. శనివారం ఈ సినిమాలో తరుణ్‌భాస్కర్ నటించిన జాక్ రెడ్డి క్యారెక్టర్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సంజీవ్‌రెడ్డి దర్శకుడు. మధుర శ్రీధర్‌రెడ్డి, నిర్వి హరిప్రసాద్‌రెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం సమాజంలో యంగ్ కపుల్స్ ఎదుర్కొంటున్న ఓ ప్రధాన సమస్యను కథలో చూపిస్తూ వినోదాత్మకంగా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా రూపొందించామని, ఇందులో తరుణ్‌భాస్కర్ పోషించిన జాక్ రెడ్డి పాత్ర ప్రేక్షకుల్ని పొట్టచెక్కలయ్యేలా నవ్విస్తుందని దర్శకుడు చెప్పారు. త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమాలో వెన్నెల కిశోర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్.



# దక్షిణాదిలో నటిగా కొనసాగడం కష్టం

'నా 28వ ఏటే ఇద్దరు పిల్లలకు తల్లిని అయ్యాను. ఆ తర్వాత కూడా ఎన్నో విభిన్నమైన పాత్రలు చేశా. కానీ స్టార్ హీరోల సరసన మాత్రం అవకాశాలు రాలేదు. దానికి కారణం.. నేను వివాహితనవ్వడమే.' అంటూ వాపోయారు నటి జ్యోతిక. ఇటీవలే ఆమె నటించిన 'డబ్బా కార్టెల్' వెబ్ సిరీస్ ఓటీటీలో విడుదలైంది. ఈ సిరీస్ ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది చిత్రపరిశ్రమపై కొన్ని వ్యాఖ్యలు చేశారు జ్యోతిక. 'గతంలో నాలాంటి మహిళల కోసమే కథలు రాసే సంస్కృతి ఉండేది. గ్రేట్ డైరెక్టర్ కె.బాలచందర్ మహిళా నేపథ్యంలోనే ఎన్నో కథలు రాశారు. సినిమాలు తీశారు. పెద్ద పెద్ద నిర్మాతలు కూడా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు నిర్మించేవాళ్లు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. అగ్ర హీరోలదే హవా. స్త్రీ ప్రాధాన్యతా చిత్రాలు తగ్గిపోవడానికి బడ్జెట్ కూడా ఓ కారణమైతే.. మనసు లేకపోవడం మరో కారణం. ముఖ్యంగా స్త్రీల కోసం కథలు రాసే రచయితలు ఇప్పుడు లేరు. అందుకే దక్షిణాదిలో నటిగా కొనసాగడం కష్టం. సిద్ధాంతాలకు కట్టుబడి సినిమాల్లో నటించే స్త్రీలు అక్కడ ఒంటరిపోరు చేయాల్సొస్తుంది. కానీ ఉత్తరాదిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ ఇంకా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు వస్తున్నాయ్. ఈ విషయంలో బాలీవుడ్ దర్శక, నిర్మాతలను, రచయితలను అభినందించకుండా ఉండలేకపోతున్నా.' అన్నారు జ్యోతిక.



# నీ ప్రేమ సంద్రమే.. నేను నీ తీరమే..

కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ప్రేమకథ 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకుడు. రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'కన్నా.. నీ ప్రేమ సంద్రమే.. నేను నీ తీరమే.. కన్నా.. నువ్వు నా ప్రాణమే.. నేను నీ దేహమే..' అంటూ సాగే ఈ గీతాన్ని భాస్కరభట్ల రవికుమార్ రాయగా, సామ్ సీఎస్ స్వరపరిచారు. సత్యప్రకాష్, మాళవిక సుందర్ ఆలపించారు. 'అలలుగా తాకగానే కరిగిపోనా నీలో.. ప్రళయమై తాండవిస్తే అలజడే నాలో..' అనే హృద్యమైన పదాలతో ప్రేమభావాన్ని వ్యక్తీకరిస్తూ ఈ పాట తీర్చిదిద్దబడిందని, యువతరాన్ని ఉర్రూతలూగించే ప్రేమకథ ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: డానియేల్ విశ్వాస్.

# పోక్సో చట్టం నేపథ్యంలో..



హీరో నాని సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'కోర్ట్-స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్‌జగదీష్ దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఈ నెల 14న విడుదలకానుంది. బుధవారం ట్రైలర్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పోక్సో చట్టం నేపథ్యంలో సంక్లిష్టమైన సామాజిక సమస్యను చర్చించే చిత్రమిదని, సందేశాత్మకంగా ఉంటుందని, ఈ నెల 7న ట్రైలర్‌ను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. శివాజీ, సాయికుమార్, హర్ష్ రోషన్, శ్రీదేవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణ సంస్థ: వాల్ పోస్టర్ సినిమా, కథ, దర్శకత్వం: రామ్ జగదీష్.



# శివంగి ప్రతీకారం

ఆనంది, వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో దేవరాజ్ భరణి ధరన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'శివంగి'. నరేష్ బాబు పి నిర్మాత. ఈ నెల 7న విడుదల కానుంది. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'అందరి జీవితంలో గుడ్‌డే, బ్యాడ్‌డే అని ఒక రోజు ఉంటుంది. కానీ నా జీవితంలో రెండూ ఓకే రోజు జరిగాయి' అంటూ ఆనంది చెప్పిన సంభాషణతో మొదలైన ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. వరలక్ష్మి శరత్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించింది.మహిళా ప్రధానంగా సాగే థ్రిల్లర్ చిత్రమని, రివేంజ్ నేపథ్య కథాంశమని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఏ.హెచ్.కాషిఫ్, ఎబినేజర్‌పాల్ సంగీతాన్నందించారు.

# షణ్ముఖి రహస్యం



ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, ఆది పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపిస్తాడని, ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ డివోషనల్ థ్రిల్లర్ ఇదని దర్శకుడు తెలిపారు. ఈ కథలోని మలుపులు, రహస్యాలు ఆద్యంతం థ్రిల్‌కు గురిచేస్తాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: తులసీ రామ్, షణ్ముగం, రమేష్ యాదవ్, దర్శకత్వం: షణ్ముగం సాప్పని.

# ప్రదీప్ రంగనాథన్‌తో మైత్రీ?



'లవ్ టుడే'లో ప్రదీప్ రంగనాథన్‌ని చూసి 'ఎవరీ జూనియర్ ధనుష్..' అనుకున్నారంతా. ఇప్పుడు 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'తో తెలుగు ప్రేక్షకులకు కూడా అభిమాన హీరో అయిపోయాడు తను. దర్శకత్వంలో కూడా పట్టు ఉండటంచేత.. చేస్తున్న ప్రతి సినిమాలో అతని సంతకం కనిపిస్తుంటుంది. అదే 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'లో కూడా కనిపించింది. ఇదిలావుంటే.. టాలీవుడ్ నిర్మాతల కన్ను ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్‌పై పడింది. మైత్రీ మూవీమేకర్స్ అధినేతలు అతనితో సినిమా లాక్ చేసుకున్నారని ఫిల్మ్ వర్గాల భోగట్టా. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'ని తెలుగులో విడుదల చేసింది కూడా మైత్రీమూవీమేకర్సే కావడం గమనార్హం. ప్రస్తుతం విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'ఎల్.ఐ.కె.' సినిమా చేస్తున్నారు ప్రదీప్ రంగనాథన్. అందులో కృతిశెట్టి కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతోపాటు మైత్రీమూవీ మేకర్స్ సినిమా కూడా సెట్స్ పైకి వెళ్లనున్నదట. కొత్త దర్శకుడు కీర్తీశ్వరన్ ఈ చిత్రానికి దర్శకుడని సమాచారం. లవ్ టుడే, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్ సినిమాల తరహాలోనే క్రేజీ యూత్‌ఫుల్ కథతో రూపొందనున్న ఈ సినిమాలో మలయాళ భామ మమితా బైజు కథానాయికగా నటించనున్నది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియరానున్నాయి.